# భట్టీ.. బిల్లు చదువుకో..




కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న డిప్యూటీ సీఎం భట్టి

## అమ్మకానికి శ్రావణపల్లి కోల్‌బ్లాక్

- 67 బ్లాక్‌ల వేలానికి శ్రీకారం
- లాంఛనంగా ప్రారంభించిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సమక్షంలోనే ప్రకటన
- వేలాన్ని ఆపాలని ఎక్కడా ప్రస్తావించని భట్టి

హైదరాబాద్, జూన్ 21 (నమస్తే తెలంగాణ): దేశవ్యాప్తంగా 67 కోల్‌బ్లాక్‌ల వేలానికి కేంద్ర బొగ్గు మంత్రిత్వశాఖ శుక్రవారం శ్రీకారం చుట్టింది. తెలంగాణలోని శ్రావణపల్లి కోల్‌బ్లాక్‌ను సైతం అమ్మకానికి పెట్టింది. ఈ వేలాన్ని కేంద్ర బొగ్గుశాఖ మంత్రి జీ కిషన్‌రెడ్డి హైదరాబాద్‌లో లాంఛనంగా ప్రారంభించారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సమక్షంలోనే ఆయన తెలంగాణలోని శ్రావణపల్లి కోల్‌బ్లాక్‌ను వేలానికి పెట్టడం గమనార్హం. మాదాపూర్‌లోని వెస్టిన్ హోటల్లో రిమోట్‌ను నొక్కి వేలానికి సంబంధించిన వెబ్‌సైట్‌ను కిషన్‌రెడ్డి ఆవిష్కరించారు. ఇదే వేదికపై ఉన్న భట్టి విక్రమార్క బొగ్గు బ్లాక్ వేలాన్ని ఆపాలని ప్రస్తావించకపోవడం గమనార్హం. అంతేకాకుండా గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం వేలంలో పాల్గొని బొగ్గుగనులను సాధించాల్సి ఉండెనని చెప్తూ తాము వేలానికి అనుకూలమన్నట్టుగానే వ్యాఖ్యానించారు. 'గత ప్రభుత్వం అనాలోచితంగా సింగరేణి సంస్థను వేలంపాటలో పాల్గొనకుండా చేసింది. దీని ఫలితంగా సత్తుపల్లి బ్లాక్-3, కోయగూడెం బ్లాక్-3లను ఇతర కంపెనీలు పొందాయి' అంటూ తాము వేలానికి అనుకూలమని తమ వైఖరిని భట్టి బయటపెట్టుకున్నారు. కనీసం బొగ్గు గనుల వేలాన్ని ఉప ముఖ్యమంత్రి హోదాలో వ్యతిరేకించకపోవడం గమనార్హం. కార్యక్రమంలో బొగ్గుశాఖ సహాయ మంత్రి సతీశ్‌చంద్ర దూబే, ఆ శాఖ కార్యదర్శి అమృత్‌లాల్ మీనా, అడిషనల్ సెక్రెటరీ నాగరాజు, ముఖేశ్‌చౌదరి, సింగరేణి సంస్థ సీఎండీ బలరాం తదితరులు పాల్గొన్నారు. అయితే వేలాన్ని శుక్రవారం ప్రారంభించినా, టెండర్లు ముగిసి, వేలం పూర్తయ్యేందుకు 3 నెలలు పడుతుందని బొగ్గు మంత్రిత్వశాఖ అధికారులు తెలిపారు.

### వేలంతో రాష్ట్రాలకే ఆదాయం: కిషన్‌రెడ్డి

బొగ్గు గనుల వేలంతో రాష్ట్ర ప్రభుత్వాలకే లబ్ధిచేకూరుతుందని బొగ్గుశాఖ మంత్రి జీ కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. బొగ్గుబ్లాక్ వేలాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. వేలం వల్ల రాష్ట్రాలకే ఆదాయం సమకూరుతుందని చెప్పారు. ఆదాయం కోసమే తాము బొగ్గు గనుల వేలం వేయడం లేదని, దేశంలో బొగ్గు దిగుమతిని తగ్గించడం, స్వయం సమృద్ధిని సాధించేందుకే వేలానికి శ్రీకారం చుట్టామని పేర్కొన్నారు. సుప్రీం మార్గదర్శకాలను అనుసరించే బొగ్గు బ్లాక్‌ల వేలం వేస్తున్నామని, 2020 నుంచి ఇప్పటివరకు 107 కోల్‌బ్లాక్‌లను అత్యంత పారదర్శకంగా వేలం వేశామని తెలిపారు.

### గత ప్రభుత్వం వేలంలో పాల్గొనాల్సి ఉండే: భట్టి విక్రమార్క

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం బొగ్గు గనుల వేలంలో పాల్గొని గనులను సాధించాల్సి ఉండెనని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అభిప్రాయపడ్డారు. వేలంలో పాల్గొనకపోవడంతో నాలుగు గనులను సింగరేణి కోల్పోయిందని చెప్పారు. మరోవైపు ఎంఎండీఆర్ యాక్ట్ సెక్షన్ 17(ఏ)1 ప్రకారం రిజర్వేషన్ విధానంలో కేంద్రం కొత్త బ్లాక్‌లను సింగరేణికి కేటాయించాలని వ్యాఖ్యానించారు. తెలంగాణ ప్రయోజనాలను కిషన్‌రెడ్డి కాపాడాలని, ప్రధాని మోదీ అపాయింట్‌మెంట్ తీసుకుంటే తాము అఖిలపక్షంతో సహా వచ్చి బొగ్గు బ్లాకులు కేటాయించాలని కోరతామని చెప్పారు. రాష్ట్రంలో గోదావరి, ప్రాణహిత లోయ ప్రాంతంలో మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయని, వాటిని సింగరేణి సంస్థకే అప్పగించాలని కోరారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరపున భట్టి విక్రమార్క కేంద్రమంత్రికి వినతిపత్రాన్ని సమర్పించారు.

---

- ఆ బిల్లు తెచ్చిందే కాంగ్రెస్
- అమలు చేసింది బీజేపీ
- బీఆర్‌ఎస్ మద్దతు ఇవ్వలేదు
- సింగరేణి బ్లాకుల వేలం ఆపాలి
- మాజీ ఎంపీ వినోద్‌కుమార్



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మాజీఎంపీ వినోద్‌కుమార్. పక్కన నారదాసు

హైదరాబాద్, జూన్ 21 (నమస్తే తెలంగాణ): మైన్స్, మినరల్స్ చట్ట సవరణ బిల్లును 2011 డిసెంబర్ 12న మొదట ప్రవేశపెట్టింది మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని కాంగ్రెస్ సర్కారేనని, ఆ బిల్లు స్టాడింగ్ కమిటీకి వెళ్లి, అక్కడ చర్చించిన తర్వాత లోక్‌సభకు వచ్చిందని బీఆర్‌ఎస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ చెప్పారు. అప్పటికే లోక్‌సభ సమయం ముగియడం, ఎన్నికలు రావడంతో బిల్లు రద్దయిందని, యూపీఏ హయాంలో స్టాండింగ్ కమిటీ సూచనల మేరకు తెచ్చిన బిల్లునే బీజేపీ ప్రభుత్వం ఆర్డినెన్స్ రూపంలో 2015 జనవరి 12న తీసుకొచ్చిందని గుర్తు చేశారు. మూజువాణి ఓటుతోనే బిల్లు ఆమోదం పొందిందని, ఈ బిల్లును ఒకసారి భట్టి చదువుకోవాలని సూచించారు. ఆ బిల్లుకు బీఆర్‌ఎస్ ఎంపీలు మద్దతిచ్చారని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నట్టు చెప్పారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్ రావుతో కలిసి వినోద్‌కుమార్ మీడియా సమావేశంలో మాట్లాడారు. బీఆర్‌ఎస్ ఎంపీల నిరసనల మధ్యే మూజువాణి ఓటుతో మినరల్ బిల్లు పాస్ అయిందనే కనీస పరిజ్ఞానం కాంగ్రెస్‌కు లేకపోవడం దురదృష్టకరమని మండిపడ్డారు. భట్టి బేషరతుగా తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రధాని మోదీ, సీఎం రేవంత్‌రెడ్డి కలిసి సింగరేణిని అమ్ముతున్నారని విమర్శించారు. సెక్షన్ 17ఏ కింద బొగ్గు బ్లాక్‌లను సింగరేణికి రిజర్వ్ చేసే అవకాశమున్నదని, గతంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సింగరేణిపై కేంద్రానికి రాసిన లేఖనే ఇప్పుడు రేవంత్ ప్రామాణికంగా తీసుకోవాలని సూచించారు. కిషన్‌రెడ్డి, రేవంత్‌రెడ్డి తక్షణమే ఢిల్లీ వెళ్లి మోదీని కలిసి సింగరేణి, సింగరేణి కార్మికుల జీవితాలను బతికించాలని విజ్ఞప్తి చేశారు. సింగరేణిలో వందేండ్లకు సరిపడా బొగ్గు నిల్వలున్నాయని, వాటిని తెలంగాణ అభివృద్ధి కోసం వినియోగించాలని కోరారు. సింగరేణిని చంపేందుకే బీజేపీ నుంచి ఎనిమిది ఎంపీలు గెలిచారా? అంటూ వినోద్‌కుమార్ నిలదీశారు. రేవంత్‌రెడ్డి తన గురువు చంద్రబాబుతో మాట్లాడైనా ఎన్డీయే ప్రభుత్వంలో సింగరేణికి బొగ్గు గనులు దక్కేవిధంగా చేయాలన్నారు. మోదీతో ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా సింగరేణి బ్లాక్‌ల వేలాన్ని వాయిదా వేశారు తప్ప, సింగరేణికి కేటాయించలేదని తెలిపారు.

### నిజాం కాలం నుంచే హక్కులు

రాష్ట్రంలో బొగ్గు గనుల అన్వేషణ, తవ్వకాల కోసం సింగరేణికి నిజాం ప్రభుత్వం ప్రత్యేక హక్కులు ఇచ్చిందని, మైన్స్ అండ్ మినరల్స్ డెవలప్మెంట్ అండ్ రెగ్యులేషన్ (ఎంఎండీఆర్) చట్టం, 1957 సవరణకు ముందు, ఆ తర్వాత 2015 వరకు సింగరేణికి పూర్తి హక్కులు ఉన్నాయన్నారు. సింగరేణి, తెలంగాణ, కేంద్ర ప్రభుత్వాల మధ్య త్రైపాక్షిక ఒప్పందానికి అనుగుణంగా మైనింగ్ ప్రణాళికలు ఆమోదించారని చెప్పారు. సవరించిన ఎంఎండీఆర్ చట్టం-2015 నింబంధనల ప్రకారం బొగ్గు బేరింగ్ ప్రాంతాలను ప్రభుత్వ (బొగ్గు గనుల) కంపెనీకి కేటాయించవచ్చన్నారు. కేంద్ర సర్కారు వేలం వేయాలని భావిస్తున్న తెలంగాణలోని నాలుగు బొగ్గు బ్లాకులను సింగరేణికి కేటాయించవచ్చన్నా రు. సెక్షన్ 11ఏ(1) ప్రకారం పోటీ బిడ్డింగ్ ద్వారా వేలంలో కేటాయించవచ్చని, లేదా సెక్షన్ 11(ఏ)(3)(ఏ) కింద, ఎంఎండీఆర్‌లోని సెక్షన్ 17(ఏ) (2ఏ) కింద రిజర్వేషన్లో కేటాయించవచ్చన్నారు. సత్తుపల్లి బ్లాక్-3, కోయగూడెం ఓసీ-3, శ్రావణపల్లి ఓసీ, కల్యాణి ఖని నం.6 ఇంక్లైన్ (యూజీ) అనే నాలుగు బొగ్గు బేరింగ్ ప్రాంతాల కేటాయింపు కోసం సింగరేణి గతంలోనే కేంద్రాన్ని సంప్రదించిందని వినోద్‌కుమార్ వివరించారు.

### కేటాయింపుపై సీఎంపీడీఐఎల్ సిఫారసు

ఈ నాలుగు బ్లాకులను సింగరేణికికి కేటాయిస్తే, దాదాపు 12 మిలియన్ టన్నుల థర్మల్ బొగ్గును దిగుమతి చేసుకోవడం, విద్యుత్ రంగానికి బొగ్గు సరఫరా పెంచడం సాధ్యమవుతుందని కేంద్ర బొగ్గు గనుల మంత్రిత్వశాఖ కూడా గతంలో తెలిపిందని చెప్పారు. వివరాల పరిశీలన తర్వాత సింగరేణికి ఈ బ్లాకులను కేటాయించాలని కేంద్ర గనుల ప్రణాళిక నిర్వహణ సంస్థ (సీఎంపీడీఐఎల్) సిఫార్సు చేసిందని తెలిపారు. ఇప్పటికే నిర్వహిస్తున్న గనులకు కొనసాగింపుగా విస్తరణ ప్రాంతాల్లో మైనింగ్, నిల్వల పరిరక్షణ సాంకేతికంగా మరింత సాధ్యపడుతుందన్నారు.

### చట్టంలోనే వెసులుబాటు

చట్టంలోని మూడు సెక్షన్ల ఆధారంగా తెలంగాణలోని నాలుగు బొగ్గు బ్లాకులను సింగరేణికి కేటాయించవచ్చునని, కానీ కేంద్ర బొగ్గు గనుల మంత్రిత్వశాఖ బహిరంగ వేలం వేయాలని నిర్ణయించిందని వినోద్‌కుమార్ తెలిపారు. ఈ నిర్ణయం సింగరేణి మనుగడ, కార్మికుల జీవితాలపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. జాతీయ బొగ్గు నిల్వల్లో ఆరు శాతం వాటా కలిగిఉన్న సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్సీసీఎల్) దేశ బొగ్గు ఉత్పత్తిలో సుమారు 8శాతం చేస్తుందన్నారు. సింగరేణి ఏడేండ్ల నుంచి పనితీరును స్థిరంగా మెరుగుపర్చుకుంటోందని, నిరుడు 65 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి స్థాయికి చేరుకుందని, ఈ ఏడాది 68 మిలియన్ టన్నులు ఉత్పత్తి చేయాలని భావిస్తోందని చెప్పారు. గోదావరి వ్యాలీ కోల్ ఫీల్డ్స్ (జీవీసీఎఫ్)లో బొగ్గు ఉత్పత్తి అనేక అవాంతరాలతో కూడుకున్నదని, ఎక్కువ లోతు, నాణ్యతలేని కారణంగా సవాళ్లు ఎదురవుతున్నాయని తెలిపారు. ఓపెన్ కాస్ట్ మైనింగ్‌కు అనువుగా ఉండే బొగ్గు నిల్వల కోసం కంపెనీ కష్టపడుతున్నదని చెప్పారు.

---

## సింగరేణి గొంతు కోసేందుకే..

- గనులవేలాన్ని నాడు వ్యతిరేకించిన రేవంత్ నేడు మౌనమేల?
- కాంగ్రెస్ అవకాశవాద రాజకీయానికి పరాకాష్ఠ ఇది
- బీజేపీ నీతిలేని నిర్ణయాల్లో భాగమైన కాంగ్రెస్
- ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఫిరాయింపుల డ్రామా
- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజం

హైదరాబాద్, జూన్ 21 (నమస్తే తెలంగాణ): ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సింగరేణి గనుల వేలాన్ని వ్యతిరేకించిన సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పుడు ఎందుకు మౌనంగా ఉన్నారని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు ప్రశ్నించారు. తెలంగాణలోని బొగ్గు గనులను కేంద్రం నేరుగా సింగరేణి సంస్థకు కేటాయించాలని మాట్లాడిన రేవంత్‌రెడ్డి ఇప్పుడు ఆశ్చర్యకరంగా మౌనం వహించడం అనేక అనుమానాలకు తావిస్తున్నదని శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. నాడు వ్యతిరేకించిన రేవంత్‌రెడ్డి నేడు తన ఉపముఖ్యమంత్రిని పంపిమరీ గనుల వేలంలో భాగస్వామ్యం కావడం కాంగ్రెస్ అవకాశవాదానికి పరాకాష్ఠ అని దుయ్యబట్టారు. గనుల వేలం విషయంలో దాగిన ఒత్తిళ్లు ఏమిటో వెల్లడించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ గనుల వేలం ద్వారా అంతిమంగా సింగరేణి సంస్థ ప్రైవేట్‌పరం అవుతుందని, పెట్టుబడుల ఉపసంహరణకు దారితీస్తుందనే అంశాన్ని రేవంత్‌రెడ్డి అంగీకరిస్తారో లేదో చెప్పాలని పేర్కొన్నారు. కేంద్రం గుజరాత్, ఒరిస్సా మాది రే తెలంగాణ ప్రభుత్వరంగ సంస్థ సింగరేణికి గనులను ఎందుకు కేటాయించడం లేదని ప్రశ్నించారు. ఈవైఖరిని రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు ప్రశ్నించడం లేదని నిలదీశారు. సింగరేణి గొంతు కోసేలా ఉన్న ఈ గనుల వేలంలో ఉపముఖ్యమంత్రి, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పాల్గొనడం దుర్మార్గమని విమర్శించారు. సింగరేణిని ప్రైవేట్‌పరం చేయడంలోనే తమ విజయం ఉందన్నట్టుగా వారిద్దరూ వ్యవహరించటం అత్యంత విషాదకరమని వ్యాఖ్యానించారు.

### ప్రజల దృష్టిని మళ్లించేందుకే

కార్మికుల జీవితాలతో చెలగాటమాడుతూ సింగరేణికి మరణశాసనం రాసేలా రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం నుంచి తెలంగాణ ప్రజల దృష్టిని మళ్లించేందుకే సీఎం రేవంత్‌రెడ్డి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల ఇండ్లకు వెళ్లి పార్టీ ఫిరాయింపుల డ్రామాకు తెరలేపారని కేటీఆర్ ధ్వజమెత్తారు. ఆరు నెలలైనా ఇచ్చిన గ్యారెంటీలను అమలు చేయలేని అసమర్థతను కప్పిపుచ్చుకుంటూ కాంగ్రెస్ ప్రభుత్వం డ్రామాలు చేస్తున్నదని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే తెలంగాణ ఆగమైందని, బీజేపీ నీతిలేని నిర్ణయాల్లో కాంగ్రెస్ భాగమైందని ఆరోపించారు. తెలంగాణ సంపదను బీఆర్‌ఎస్ సర్కారు కాపాడితే కాంగ్రెస్, బీజేపీలు వాటిని చెరబడుతున్నాయని, ఆ రెండు పార్టీలను తెలంగాణ సమాజం ఎన్నటికీ క్షమించదని పేర్కొన్నారు.

## బొగ్గు గనులను కాపాడుతాం: రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, జూన్ 21 (నమస్తే తెలంగాణ): మన బొగ్గు.. మన హక్కు అని, కాపాడి తీరుతామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. బొగ్గు గనుల వేలంపై మాజీమంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై సీఎం రేవంత్ రెడ్డి స్పందించారు. ఈ మేరకు శుక్రవారం 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. తెలంగాణ సంస్థల ప్రైవేటీకరణను, తెలంగాణ ప్రజల వాటాల విక్రయానికి కేంద్రం పూనుకొన్నా, కేసీఆర్ ప్రభుత్వం ప్రయత్నించినా.. కాంగ్రెస్ నాయకులు, పార్టీ శ్రేణులు అడుగడుగునా వ్యతిరేకించారని వెల్లడించారు. కేసీఆర్ సీఎం ఉన్నప్పుడే కేంద్రం సింగరేణి గనులను తొలిసారి వేలం వేసిందని, రెండు ప్రైవేటు కంపెనీలకు అప్పగించిందని అన్నారు. అప్పుడే అరబిందో, అవంతిక కంపెనీలకు కట్టబెట్టిందని చెప్పారు. అప్పుడు బీఆర్‌ఎస్ ఎందుకు మాట్లాడలేదు? అని కేటీఆర్‌ను ప్రశ్నించారు. సింగరేణి గనులను ప్రైవేటీకరించడం, వేలం వేయడాన్ని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క వ్యతిరేకించారని తెలిపారు. అవంతిక, అరబిందో కంపెనీలకు అప్పగించిన బొగ్గు బ్లాకులను రద్దు చేసి తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారని వెల్లడించారు. ఈ మేరకు భట్టి విక్రమార్క రాసిన లేఖను జత చేశారు. 'తెలంగాణ ప్రజల ప్రయోజనాలు, ఆస్తులు, హక్కులను కాపాడేది కాంగ్రెస్ ఒక్కటే. తెలంగాణ భవిష్యత్తు కాంగ్రెస్‌తో సురక్షితం. మన బొగ్గు.. మన హక్కు. కాపాడి తీరుతాం. ప్రజల ప్రతి హక్కు కోసం పోరాడుతాం' అని పేర్కొన్నారు.

---

### ఆర్టీసీ పీఎఫ్ ఖాతాల స్తంభనపై స్టే

హైదరాబాద్ జూన్ 21 (నమస్తే తెలంగాణ): ఆర్టీసీ పీఎఫ్ ఖాతాలను స్తంభింపజేస్తూ మార్చి 21న ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ జారీ చేసిన ఉత్తర్వులపై హైకోర్టు స్టే విధించింది. ఆర్టీసీ ఖాతాల స్తంభన ఉత్తర్వులను నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి విచారణను జూలై 15కు వాయిదా వేసింది.

### కోర్టు కమిషనర్ ఎదుట హాజరుకాకుంటే..

ఎలక్షన్ పిటిషన్‌ను మూసేస్తాం బండికి హైకోర్టు స్పష్టీకరణ

హైదరాబాద్ జూన్ 21 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర శాసనసభకు 2018లో జరిగిన ఎన్నికల్లో కరీంనగర్ నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా గెలిచిన గంగుల కమలాకర్ ఎన్నిక చెల్లదంటూ దాఖలు చేసిన పిటిషన్‌లో సాక్ష్యం ఇచ్చేందుకు కోర్టు కమిషనర్ ఎదుట హాజరుకావాలని బీజేపీ అభ్యర్థి, కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్‌ను హైకోర్టు ఆదేశించింది. 2019లో దాఖలైన ఈ ఎలక్షన్ పిటిషన్‌పై జస్టిస్ జీ రాధారాణి శుక్రవారం మరోసారి విచారణ జరిపారు. ఇటీవల కేంద్ర మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన బండి సంజయ్ అధికార కార్యక్రమాలతో బిజీగా ఉన్నారని ఆయన తరపు న్యాయవాది పేర్కొంటూ.. కోర్టు కమిషనర్ ఎదుట హాజరయ్యేందుకు మరికొంత గడువు ఇవాలని కోరారు. దీనిపై న్యాయమూర్తి స్పందిస్తూ.. బండి సంజయ్‌కి మరో అవకాశం ఇచ్చారు. తదుపరి విచారణను జులై 8కి వాయిదా వేశారు. ఆ లోగా అడ్వకేట్ కమిషన్ ఎదుట సాక్ష్యం ఇవ్వని పక్షంలో గంగులపై దాఖలు చేసిన ఎలక్షన్ పిటిషన్‌ను మూసివేస్తామని స్పష్టం చేశారు.

### మానవ అక్రమ రవాణాపై ప్రభుత్వాలకు నోటీసులు

హైదరాబాద్ జూన్ 21 (నమస్తే తెలంగాణ): మానవ అక్రమ రవాణాను అడ్డుకునేందుకు రూపొందించిన చట్టం అమలుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు శుక్రవారం హైకోర్టు నోటీసులు జారీ చేసింది. అక్రమ రవాణాకు గురైన మహిళలు, బాలలను రక్షించిన తర్వాత రక్షణ గృహాలకు తరలించడంపై మార్గదర్శకాలతో కౌంటర్లు దాఖలు చేయాలని కేంద్ర, రాష్ట్ర మహిళా-శిశు సంక్షేమ శాఖలతోపాటు రాష్ట్ర డీజీపీని, హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్‌ను జస్టిస్ నంద ఆదేశించారు.

---

## గనుల అర్రాస్ వెనక అదృశ్యశక్తి!

- తెర వెనుక ఉన్నదెవరో తేల్చాలి
- శ్రావణపల్లి బ్లాక్‌ను వేలం నుంచి తీసేయాలి
- సింగరేణికే కేటాయించాలి
- లేదంటే ఉద్యమానికి సిద్ధం
- బీఆర్‌ఎస్సే తెలంగాణకు రక్షణ
- కూడబలుక్కొన్న బీజేపీ, కాంగ్రెస్
- మీడియాతో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి



హైదరాబాద్, జూన్ 21 (నమస్తే తెలంగాణ): బొగ్గు గనుల వేలం వెనుక మరొక అదృశ్యశక్తి ఉన్నదని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే జీ జగదీశ్‌రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. తెర వెనక ఉన్న ఆ అదృశ్యశక్తి ఎవరో బహిర్గతం కావాలని పేర్కొన్నారు. బీజేపీ, కాంగ్రెస్ కూడబలుక్కొని బొగ్గు గనుల వేలం కొనసాగిస్తున్నాయని మండిపడ్డారు. బొగ్గు గనుల వేలం నుంచి శ్రావణపల్లి బ్లాక్‌ను ఉంచారా? తీసివేశారా? స్పష్టంచేయాలని డిమాండ్ చేశారు. శ్రావణపల్లి బ్లాక్‌ను వేలం నుంచి తీసేయాలని బీఆర్‌ఎస్ డిమాండ్ చేస్తున్నదని చెప్పారు. శ్రావణపల్లి బ్లాక్‌ను సింగరేణికి కేటాయించకుంటే ప్రత్యక్ష ఉద్యమాలకు దిగుతామని, త్వరలోనే కార్యాచరణ ప్రకటిస్తామని హెచ్చరించారు. శుక్రవారం ఆయన తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. బొగ్గు గనుల వేలానికి శ్రీకారం చుట్టిన సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో కలిసి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రెస్‌మీట్‌లో పాల్గొనడాన్ని తప్పుపట్టారు. కేంద్ర ప్రభుత్వ వైఖరిలో ఏ మార్పు వచ్చిందని భట్టి విక్రమార్క ఆ ప్రెస్‌మీట్‌లో పాల్గొన్నారని ప్రశ్నించారు. సింగరేణికి బొగ్గు బ్లాకుల కేటాయింపు కోసం కేంద్రంతో యుద్ధం చేస్తామన్న భట్టి విక్రమార్క, వేలం పాటలకు వెళ్లి అక్కడ కిషన్‌రెడ్డి ఇచ్చిన బొకేతో యుద్ధం చేస్తారా? అని ప్రశ్నించారు.

### బీఆర్‌ఎస్సే రక్షణ కవచం

బొగ్గు గనుల వేలం ఎపిసోడ్ ద్వారా తెలంగాణకు బీఆర్‌ఎస్ పార్టీయే రక్షణ కవచం అనే విషయం మరోసారి నిరూపితమైందని జగదీశ్‌రెడ్డి చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ హక్కులను ఇతరులకు ధారాదత్తం చేస్తున్నప్పుడల్లా బీఆర్‌ఎస్ పోరాటం చేస్తున్నదని వివరించారు. కృష్ణా ప్రాజెక్టులను కేఆర్‌ఎంబీకి అప్పగించకుండా పదేండ్లు కేసీఆర్ అడ్డుపడ్డారని, అసెంబ్లీలో, బయట బీఆర్‌ఎస్ చేసిన పోరాటంతో కాంగ్రెస్ ప్రభుత్వం తోక ముడిచిందని చెప్పారు. గోదావరి, కావేరి అనుసంధానంపై కూడా కేసీఆర్ తిరగబడ్డారని తెలిపారు. ఇప్పుడు సింగరేణి బ్లాక్‌ల వేలంపై కేటీఆర్ ప్రశ్నించిన తర్వాతే కాంగ్రెస్ తన వైఖరి మార్చుకున్నదని పేర్కొన్నారు. అయినా కేసీఆర్‌పై కాంగ్రెస్ ఎదురుదాడి చేస్తూనే ఉన్నదని విమర్శించారు. సింగరేణిపై ముఖ్యమంత్రికి, మంత్రులకు సోయి లేదని మండిపడ్డారు. బొగ్గు గనులను వేలం వేయడం అంటే ఉరితాడును పేనడమేనని స్పష్టం చేశారు. తెలంగాణ హక్కులపై కేసీఆర్ ఎప్పుడూ వైఖరి మార్చుకోలేదని, భట్టి విక్రమార్క పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. కేటీఆర్ ప్రెస్‌మీట్ తర్వాతే సింగరేణి బ్లాకులను ఆ సంస్థకే కేటాయించాలని భట్టి కోరారని గుర్తుచేశారు. భట్టి విక్రమార్క గురువారం చెప్పిన దానికి, శుక్రవారం చేస్తున్న దానికి పొంతన లేదని మండిపడ్డారు. కాంగ్రెస్, బీజేపీ కూడబలుక్కుని డ్రామాలు ఆడుతున్నాయని, సింగరేణి కార్మికులు ఆ రెండు పార్టీలను అర్థం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సింగరేణి బ్లాకుల వేలంపై ఆ రెండు పార్టీల వైఖరి మారితే స్పష్టంగా చెప్పాలని డిమాండ్ చేశారు.

### ఏదో బలహీనతతోనే పార్టీ మార్పు

మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి ఏదో బలహీనతతోనే పార్టీ మారుతున్నారని భావిస్తున్నట్టు మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి పేర్కొన్నారు. పోచారం ఇంటి దగ్గరకు వెళ్లిన మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ తదితరుల అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. పోచారం బీఆర్‌ఎస్ నేత కనుక ఆయన ఇంటికి తమ నేతలు వెళ్లారని తెలిపారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు, మాజీ ఎమ్మెల్సీలు నారదాసు లక్ష్మణ్‌రావు, ఎం శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి గ్యాదరి బాలమల్లు పాల్గొన్నారు.

---

## బొగ్గు గనుల వేలంపై కార్మికుల కన్నెర్ర

- బీజేపీ సర్కారు వైఖరిపై మండిపాటు
- ధర్నాలు.. నల్లబ్యాడ్జీలతో నిరసన
- కేంద్రప్రభుత్వ దిష్టిబొమ్మల దహనం
- సమ్మెకు సిద్ధమవుతున్న సంఘాలు



మందమర్రిలో నిరసన వ్యక్తం చేస్తున్న ఐక్య కార్మిక సంఘాల నాయకులు

మంచిర్యాల, జూన్ 21 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/ గోదావరిఖని/ భూపాలపల్లి రూరల్ : సింగరేణి బొగ్గు బ్లాకుల వేలంపై కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు కన్నెర్రజేశారు. సింగరేణివ్యాప్తంగా గనులపై శుక్రవారం పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టారు. నల్లబ్యాడ్జీలు ధరించి, ధర్నాలు చేసి కేంద్రం దిష్టిబొమ్మలను దహనం చేసి నిరసన తెలిపారు. సింగరేణి జోలికొస్తే ఊరుకునేది లేదని, కేంద్రం దిగిరాకపోతే ఆందోళనలు మరింత తీవ్రం చేస్తామని హెచ్చరించారు. తెలంగాణ పౌరుడైన కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి ఇక్కడి సింగరేణి బొగ్గు బ్లాకులను వేలం వేయడం దారుణమని, ఇప్పటికైనా టెండర్‌ను విరమించి తెలంగాణకు గుండెకాయలాంటి సింగరేణిని కాపాడాలని కోరారు. కేంద్ర మంత్రిగా ఆయన బాధ్యతలు చేపట్టిన పది రోజుల్లోనే సింగరేణి గనులను వేలం వేస్తున్నారని విమర్శించారు. బడా పారిశ్రామిక వేత్తలకు తొత్తులుగా మారి నాలుగు నల్ల చట్టాలు చేశారని మండిపడ్డారు. గనులను వేలం వేయకుండా సింగరేణికే అప్పగించాలని డిమాండ్ చేశారు. శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డికి ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ముస్కె సమ్మయ్య, బ్రాంచ్ ఉపాధ్యక్షుడు కొట్టె కిషన్‌రావు, సహాయ కార్యదర్శి కొంరయ్య వినతి పత్రం ఇచ్చారు. శ్రీరాంపూర్ ఆర్కే 7గనిపై ఐఎన్టీయూసీ ఉపాధ్యక్షుడు శంకర్‌రావు, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి గరిగె స్వామి, టీబీజీకేఎస్ నాయకుడు రాజూనాయక్, శ్రీనివాస్, సీఐటీయూ పిట్ కార్యదర్శి పెరుక సదానందం, డివిజన్ ఆర్గనైజర్ కస్తూరి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో, మందమర్రి ఏరియాలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, ఏరియా ఉపాధ్యక్షుడు భీమనాథుని సుదర్శన్ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. మందమర్రి ఏరియాలోని కేకే-5గని వద్ద ఐక్య కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి కేంద్రం దిష్టిబొమ్మను దహనం చేశారు. హెచ్ఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్, ఐఎఫ్‌టీయూ జాతీయ అధ్యక్షుడు శ్రీనివాస్, ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గట్టయ్య ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. కార్మిక నాయకులను గని మేనేజర్ అల్లావుద్దీన్ అడ్డుకున్నా వారు గని ముఖద్వారం వద్ద నిరసన కొనసాగించారు. ప్రైవేటీకరణ నిర్ణయానికి అనుకూలంగా వ్యవహరిస్తున్న మేనేజర్‌పై సీఎండీ బలరాం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మందమర్రి ఏరియా కాసిపేట గనిపై ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేశ్ ఆధ్వర్యంలో, గోదావరిఖని ఓసీపీ-5లో ఏఐటీయూసీ ఉప ప్రధానకార్యదర్శి మడ్డి ఎల్లారెడ్డిగౌడ్ ఆధ్వర్యంలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ నేతలు, భూపాలపల్లి ఏరియాలోని బొగ్గు గనులు, డిపార్ట్‌మెంట్ల వద్ద ఏఐటీయూసీ భూపాలపల్లి జిల్లా సహాయ కార్యదర్శి విజేందర్, కేటీకే ఓసీ-3 పిట్ సెక్రటరీ శంకర్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు కొనసాగాయి. కోల్ బ్లాక్‌ల వేలంలో రాష్ట్ర ప్రభుత్వం, సింగరేణి పాల్గొనవద్దని సింగరేణి కార్మిక సంఘాల ఐక్యవేదిక డిమాండ్ చేసింది. ఈమేరకు హెచ్ఎంఎస్ ప్రధాన కార్యాలయంలో జరిగిన సమావేశంలో పలు తీర్మానాలు చేసింది.

---

## అంబేద్కర్ అభయహస్తం ఏది?

- హామీని కాంగ్రెస్ నిలబెట్టుకోవాలి
- దళితులను ధనికులుగా చేసేందుకే దళితబంధు
- దమ్మున్న నాయకుడి నిర్ణయమది: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- పదిరలో అంబేద్కర్ విగ్రహావిష్కరణ
- సిరిసిల్ల అర్బన్ బ్యాంకు పాలకవర్గ అభినందన సభకు హాజరు



నూతనంగా ఎన్నికైన సిరిసిల్ల అర్బన్ బ్యాంకు చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్లను సన్మానిస్తున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్

సిరిసిల్ల రూరల్/సిరిసిల్ల టౌన్/ఎల్లారెడ్డిపేట/గంభీరావుపేట, జూన్ 21: దళితబంధు స్థానంలో అంబేద్కర్ అభయహస్తం పేరున రూ.10 లక్షలకు బదులు రూ.12 లక్షలు ఇస్తామన్న కాంగ్రెస్ హామీ ఏమైందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ ప్రశ్నించారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దళితులను ధనికులుగా మార్చేందుకు కేసీఆర్ దళితబంధు పథకాన్ని తీసుకొచ్చారని, ఇది దమ్మున్న నాయకుడు తీసుకున్న నిర్ణయమని కొనియాడారు. శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఆయన పర్యటించారు. ముందుగా గంభీరావుపేట మండలం సముద్ర లింగాపూర్‌లో పార్టీ కోసం పనిచేసి చనిపోయిన బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఎల్లారెడ్డిపేట మండలం పదిరలో అంబేద్కర్ విగ్రహాన్ని జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణతో కలిసి ఆవిష్కరించారు. తర్వాత సిరిసిల్లలోని పద్మశాలి కల్యాణ మండపంలో బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి ఆధ్వర్యంలో నిర్వహించిన ది సిరిసిల్ల సహకార అర్బన్ బ్యాంకు పాలకవర్గం అభినందన సభలోనూ కేటీఆర్ మాట్లాడారు. అంబేద్కర్ 125 అడుగుల విగ్రహాన్ని నెలకొల్పి గౌరవించుకున్నామని, దళితబంధుతో పదిరలో పెట్రోల్ బంక్, దుమాల శివారులో విజయలక్ష్మి ఇండస్ట్రీస్ పేరిట రైస్‌మిల్లును ఏర్పాటు చేసుకుని ఆర్థికంగా నిలదొక్కుకోవటానికి కేసీఆర్ ప్రభుత్వం సంకల్పించిందని వెల్లడించారు.

### 'సిరిసిల్ల బ్యాంకు'ను నం.1గా నిలపాలి

సిరిసిల్ల అర్బన్ బ్యాంకును రాజకీయాలకతీతంగా అభివృద్ధి చేయాలని, రాష్ట్రంలోనే అగ్రభాగాన నిలపాలని కేటీఆర్ సూచించారు. రాష్ట్రంలో 47 సహకార బ్యాంకులు ఉన్నాయని, వీటన్నింటిలో సిరిసిల్ల అర్బన్ బ్యాంకును అగ్రభాగాన నిలిపేందుకు పాలకవర్గం కృషి చేయాలని అన్నారు. బ్యాంకు ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తూ డిపాజిట్లతోపాటు రుణాలు అందించాలని తెలిపారు. సంస్థ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా మంత్రి, కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌తోపాటు అధికారంలో ఉన్న పార్టీ నేతలు, ప్రజాప్రతినిధుల సహకారం తీసుకోవాలని తెలిపారు. అర్బన్ బ్యాంకు ఎన్నికలు పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల తరహాలో జరిగాయని, ఈ పోటాపోటీ ఎన్నికల్లో గెలుపొందిన, ఓడిన వారందరికీ అభినందనలు తెలిపారు. రాబోయే నాలుగేండ్లలో కౌన్సిలర్ ఎన్నికలు మినహా వేరే ఏ ఎన్నికలు లేవని, ఎలాంటి పంచాయితీలు లేకుండా బ్యాంకు అభివృద్ధితో పాటు సిరిసిల్ల పట్టణాభివృద్ధికి పాటుపడాలని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, జడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, ఎంపీపీ పిల్లి రేణుక, సెస్ డైరెక్టర్ వర్స కృష్ణహరి, మాజీ డైరెక్టర్ కుంబాల మల్లారెడ్డి, బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, మున్సిపల్ వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, అర్బన్ బ్యాంకు చైర్మన్ రాపెల్లి లక్ష్మీనారాయణ, వైస్ చైర్మన్ అడ్డగట్ల మురళి, సెస్ డైరెక్టర్ దార్నం లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.